క్లుప్తంగా

రిమ్స్‌లో అల్పాహారం పంపిణీ



కడప కోటిరెడ్డిసర్కిల్: బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నగర శివార్లలోని రిమ్స్ వద్ద అల్పాహారం పంపిణీ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రోగులతోపాటు వచ్చిన సహాయకులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాసట సంస్థ సభ్యులు చంద్రమౌలిరెడ్డి, ఈశ్వరయ్య, విజయ్, హరిబాబు, నరసింహారెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ స్పెషల్ కోర్సుల్లో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్: హెలెన్ కెల్లర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో బిఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుకు ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ దౌలత్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరదలచిన వారు బ్యాచిలర్ డిగ్రీ లేక మాస్టర్ డిగ్రీలో సైన్సు, సోసియల్ స్టడీస్, హ్యూమానిటీస్‌లో ఓసీలు 50 శాతం మార్కులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలు 45 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ లేక టెక్నాలజీలో సైన్సు, మ్యాథమాటిక్స్‌ల స్పెషలైజేషన్ కలిసి 55 శాతం మార్కులు కలిగి ఉండాలని లేక దీనికి సమానమైన ఏదైనా విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సులో చేరుటకు అర్హులన్నారు. వివరాలకు 99660 06758 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ప్రచారం కోసమే తనిఖీలు

కడప ఎడ్యుకేషన్: విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పాఠశాలల తనిఖీ కార్యక్రమం కేవలం ప్రచారం కోసమే చేస్తున్నట్లు స్పష్టమవుతోందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. విద్యా సంవత్సరం ముగుస్తున్న సమయంలో ఈ తనిఖీలేంటని ప్రశ్నించారు. తనిఖీల సమయంలో ఉపాధ్యాయులు, అధికారులకు తగిన సూచనలిచ్చి ప్రోత్సహించాల్సింది పోయి అధికార దర్పంతో సస్పెండ్ చేయడమేమిటన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ కడప రీజనల్ పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులపతి, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి కోరారు. పాఠశాల విద్య ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టిన వెంకట క్రిష్టారెడ్డిని ఆదివారం వారు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప రీజనల్ పరిధిలోని 8 జిల్లాల విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లో పెండింగ్ ఎంక్వయిరీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రాజమోహన్‌రెడ్డి, వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు ఇసి విశ్వనాథరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చౌదరి పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయడం తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నదని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కెసీ బాదుల్లా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ, భవన నిర్మాణ కార్మికులకు వేసవి తాపం నుంచి కాపాడేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసి మజ్జిగ సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సుబ్బరాయుడు, లింగన్న పాల్గొన్నారు.

చేతివృత్తిదారుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న మన్నూరు భాస్కరయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్: చేతివృత్తిదారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేతివృత్తిదారుల సమస్యలపై గ్రామాల్లో సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ చేతివృత్తిదారుల సంఘం నాయకులు శివ, సుబ్బారావు, లక్ష్మయ్య, గంప సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నాపరు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా..

కడప కార్పొరేషన్: కడప నగర ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో భాగంగా ఆదివారం ఉదయం కడప మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోటిరెడ్డి సర్కిల్ వద్ద మున్సిపల్ కమిషనర్ ఎస్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఎఫ్ఓ సందీప్‌రెడ్డిలు జెండా ఊపి ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు. కోటిరెడ్డి సర్కిల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లె, మహావీర్ సర్కిల్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, శిల్పారామం మీదుగా నగరవనం చేరింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి వారం ఒక ఈవెంట్ నిర్వహించాలన్నారు. నగర వనంలో త్వరలో ట్రెక్కింగ్ గ్రూప్ కూడా ఏర్పాటు చేస్తామని డీఎఫ్ఓ చెప్పడం అభినందనీయమన్నారు. వేసవి సెలవుల్లో గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్, జయనగర్ కాలనీ జెడ్పీ హైస్కూల్, చెమ్మమియ్యాపేట జెడ్పీ స్కూల్, మున్సిపల్ ఉర్దూ స్కూల్‌లో సమ్మర్ క్యాంపులు నిర్వహించబోతున్నామన్నారు. ఇందులో విద్యార్థులకు హిపాప్, క్లాసికల్ డ్యాన్స్, మ్యూజిక్, డ్రామా ఇతర అంశాలు నేర్పించబడుతాయన్నారు. రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజుతో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థులెవరైనా ఇందులో పాల్గొనేవచ్చన్నారు. మే 1వ తేదీ నుంచి 45 రోజుల పాటు సమ్మర్ క్యాంప్ ఉంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి తదితరులు

టీచర్ల బదిలీలు నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత బదిలీల కోడ్‌తో టీచర్ల బదిలీలను నిర్వహించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రావన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జిల్లాశాఖ కార్యనిర్వాహక వర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు, అధికారులు మారినప్పుడల్లా రకరకాల విధి విధానాలతో టీచర్ల బదిలీ మార్గదర్శకాలు విడుదల చేయడం జరుగుతోందన్నారు. వాటిపై టీచర్లు కోర్టు మెట్లు ఎక్కడంతో బదిలీలు నిర్వహించడంలో అనేక అవరోధాలు ఏర్పడుతున్నాయన్నారు. అందువల్ల ఆపస్ ఎప్పటినుంచో కోరుతున్న విధంగా టీచర్లకు శాశ్వత బదిలీల కోడ్ రూపొందించి వేసవి సెలవుల్లోనే బదిలీలు నిర్వహించాలన్నారు. ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు రామమోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, జిల్లా సహాధ్యక్షుడు రెడ్డయ్యరెడ్డి, నారాయణరెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, చంద్రమోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రావన్‌కుమార్

సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే దిశగా ముందుకు పోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రామసుబ్బయ్య, సివి ప్రసాద్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కడప ఏపీటీఎఫ్ కార్యాలయం వేదికగా జిల్లా సబ్ కమిటి ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రీమియం కడుతున్నా మెరుగైన వైద్య చికిత్స, ఉద్యోగ వైద్య పథకం ద్వారా అందడం లేదన్నారు. న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ర్యాలీ

కడప కల్చరల్ : రెండు రోజుల క్రితం కశ్మీర్‌లోని పూంజ్ లోయలో ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన భారత జవాన్లకు నివాళులు అర్పిస్తూ స్థానిక విశ్వహిందూ పరిషత్ ర్యాలీ నిర్వహించింది. ఆదివారం వీహెచ్‌పీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పాత బస్టాండులోని సంస్థ కార్యాలయం వద్ద నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అక్కడ జవాన్ల మరణంపై సంతాపం వ్యక్తం చేస్తూ కొద్దిసేపు మౌనం పాటించి వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. శ్రీ మాలిగి విద్యానిధి స్వామి మాట్లాడుతూ భారత సైన్యానికి దేశ పౌరులంతా ఒక్క తాటిపై నిలిచి మద్దతు ఇస్తున్నారని, భారత సైన్యంపై ఉగ్ర మూకల దొంగ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ బెస్త వేముల రామ మహేష్ మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ మన సైన్యానికి ఎప్పటికీ బాసటగా ఉంటుందని, మరో సైన్యంగా రక్షణ ఇస్తుందని, ధర్మపరిరక్షణకు తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ప్రతి భారతీయ పౌరుడిని సైనికుడిగా తీర్చిదిద్ది దేశ రక్షణలో సైన్యానికి తోడుగా నిలుస్తామని ప్రతిజ్ఞ చేశారు. వీహెచ్‌పీ ప్రముఖులు చెన్నకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉగ్రమూకలకు భారతసైన్యం పక్షాన గట్టి సమాధానం తెలియజేయాలని కేంద్ర రక్షణ మంత్రిని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నగర కార్యదర్శి సురేంద్ర, సహ కార్యదర్శి సంజీవ రాజు, జిల్లా సహ కార్యదర్శి చిక్కన్న, హిందూ చైతన్యవేదిక ప్రతినిధి నీలకంఠారెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి శివప్రసాద్, బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, పలువురు వీహెచ్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సంతాప ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

విద్యార్థి ఉన్నతితోనే ఉపాధ్యాయుడికి సంతోషం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

కమలాపురం : విద్యార్థి ఉన్నతిని తన విజయంగా గర్వించే ఏకైక వ్యక్తి ఉపాధ్యాయుడు అని రిటైర్డ్ ఎంఈఓ సుబ్బరాయుడు, రిటైర్డ్ ఉపాధ్యాయులు తిరుపాలయ్య, అయ్యవారమ్మ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో 1998–99 ఎస్ఎస్‌సీ బ్యాచ్ అపూర్వ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో కలసి సరదాగా గడిపి వారిని సత్కరించారు. మీరు తమకు విద్యాబుద్ధులు నేర్పారని, తామంతా మీ అడుగు జాడల్లో నడవడం వల్లనే ఈ స్థాయిలో స్థిర పడ్డామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాము వృత్తి ధర్మాన్ని పాటించామని, 24 ఏళ్ల తర్వాత మీరంతా మమ్మల్ను గుర్తు పెట్టుకుని ఒకే వేదికపై చేర్చడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు నిరుద్యోగ మహిళలకు ఇంటర్వ్యూలు

కమలాపురం : నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించడం కోసం సోమవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండేళ్లుగా ఎమ్మెల్యే గడప గడపకు తిరుగుతున్న సమయంలో అధికశాతం మంది మహిళలు తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన పారిశ్రామిక వాడ కొప్పర్తిలో నూతనంగా నెలకొల్పబడిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ అయిన ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో నిరుద్యోగ మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. సీకేదిన్నె మండలం, రోడ్డు కృష్ణాపురం వద్ద ఉన్న స్విస్ట్ కళాశాల నందు 24వ తేదీన ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సీసీ కెమెరాల తయారీ విభాగంలో ఉద్యోగ అవకాశం ఉంటుందని, టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీ.టెక్. చదివిన మహిళలు, పురుషులు సైతం ఈ ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. 19–32 సంవత్సరాల వారు అర్హులని, రూ.11 వేల నుంచి రూ.16వేల వరకు జీతం ఉంటుందని, అటెండెన్స్ బోనస్ రూ.1000తో పాటు భోజనం, బస్సు ఉచితంగా ఇస్తామన్నారు. అలాగే పీఎఫ్ అండ్ ఈఎస్ఐ కూడా వర్తిస్తాయన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చే నిరుద్యోగులు తమ వెంట ఆధార్ కార్డు, మార్క్‌లిస్ట్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలు తీసుకురావాలని, పూర్తి వివరాలకు 63096 37805, 76719 31665 నెంబర్లకు సంప్రదించాలని వారు తెలిపారు.

బసవేశ్వరుడికి ఘనంగా గురుపూజ

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన శ్రీ బసవేశ్వరుడికి గురుపూజ నిర్వహించారు. ఆదివారం బసవ జయంతి సందర్భంగా బసవేశ్వరుడికి గురు పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజలలో భాగంగా స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించి పూలు, పట్టువస్త్రాలతో అలంకరణ చేశారు. ఈ పూజలు ఆలయ పాలక మండలి అధ్యక్షులు పాలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు నాగభూషణం సురేష్‌బాబు, భాస్కర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.

కళాకారులను ఆదరించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కళలను, కళాకారులను ఆదరించాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం వసంతపేటలోని కోదండ రామస్వామి కల్యాణ మండపంలో చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ అష్టమ వార్షికోత్సవం సందర్భంగా నందవరం చౌడేశ్వరిదేవి పురస్కారాలను ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజలను చైతన్యపరిచేది కళాకారులేనని, వారిని ఆదరించాలని తెలిపారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంభం పాములేటి మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో 8 ఏళ్లుగా కళాభివృద్ధికి కృషి చేస్తున్న కళాకారులను, కవులను ప్రోత్సాహకంగా అవార్డులను ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, నాటక రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్‌కు సాహిత్య కళారత్న అవార్డు, ప్రముఖ రంగస్థల నటీమణి శారదాభాయి నటకళారత్న అవార్డు, రంగస్థల నటుడు ఎస్.నాగమునికి గానకళారత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ 8 ఏళ్లలో 48 మందికి అవార్డులను అందించామని తెలిపారు. నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్ ఖాన్ ఆధ్వర్యంలో శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్యం, జానపద నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సంగిరెడ్డి పుల్లారెడ్డి, రాష్ట్ర తొగటవీరక్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయప్రసాద్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడించల చంద్రమౌళి, తొగటవీర క్షత్రియ మహిళా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరింటి రేణుక, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, రాగా నరసింహారావు, భీమునిపల్లి నాగరాజు, విజయ భాస్కర్, కొత్తపల్లె శీను, బాలనరసింహులు పాల్గొన్నారు.



నాగమునికి గానకళారత్న అవార్డును అందజేస్తున్న దృశ్యం

ఉమామహేశ్వరులకు విశేష పూజలు

రాజంపేట టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని గడ్డివీధిలో వెలసిన బసవేశ్వర స్వామి మఠంలో ఆదివారం ఉమామహేశ్వరుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అక్షయ తదియ, బసవ జయంతిని పురస్కరించుకొని మఠం అధిపతులు రుద్రమూర్తి, సురేష్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కల్యాణ మూర్తులను కొలువుదీర్చి పులివెందులకు చెందిన మిట్టమల్లేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు రుద్రమూర్తి, బసవరాజుల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోత్సకంగా జరిపించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరుల ఉత్సవమూర్తులు

అమ్మవారికి బోనాలు

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె మండలంలోని అనంతపురం గంగమ్మ తల్లి ఆలయానికి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఆదివారం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ రవీంద్రరాజు, నిర్వాహకులు క్యూ లైన్‌లో భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించారు. ప్రత్యేకంగా పూజలు చేశారు. చల్లంగా దీవించు తల్లీ అంటూ వేడుకున్నారు. కొందరు తలనీలాలు అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



కడప అర్బన్: కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జెడ్పీ సమీపంలో రోడ్లపై తిరుగుతున్న గుర్తు తెలియని వృద్ధుడు (70) అనారోగ్యంతో బాధపడుతూ వుండగా ఆదివారం రిమ్స్‌లో చేర్పించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే కడప ఒన్‌టౌన్ సీఐ ఎస్.వి నాగరాజు సెల్ నెం– 91211 00510లో సంప్రదించాలని తెలియజేశారు.

కమనీయం..చెన్నకేశవుడి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న చెన్నకేశవస్వామి



సంబటూరులో చెన్నకేశవస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కమలాపురం : మండల పరిధిలోని సంబటూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వాముల వారి కల్యాణం కమనీయంగా జరిగింది. లక్ష్మీచెన్నకేశవస్వామి వారి 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. అశేష భక్త జనసందోహం నడుమ వేద పండితుల మంత్రోచ్చారణలతో స్వామి వార్ల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. అంతకు ముందు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకములు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తులందరికి నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలోని పుర వీధుల గుండా స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన స్వామి వారి ఉయ్యాల సేవను వీక్షించేందుకు భక్తులు ఆసక్తి చూపారు. చెక్కభజన భక్తులను విశేషంగా అలరించింది.

బండలాడుగు పోటీలు

సంబటూరులో వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బండ లాగుడు పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 12 జతల కాండ్లు పోటీలో తలపడ్డాయి. విజేతలకు వరుసగా రూ.30,016, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5 వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతులను దాతల ద్వారా అందజేశారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. పోతురాజు వద్ద ముద్దలను ఏర్పాటు చేసి జంతుబలి నిర్వహించారు. ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో విందుభోజనాలను ఆరగించారు.



విద్యాభివృద్ధికి కృషి

కడప ఎడ్యుకేషన్: పాఠశాల విద్య ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టిన వెంకట క్రిష్టారెడ్డిని ప్రవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (కృష్మా) జిల్లా అధ్యక్షుడు లెక్కల జోగిరామిరెడ్డి ఆదివారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే ప్రవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

శ్రీ లక్ష్మినరసింహునికి చందనోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం బ్రాహ్మణవీధిలోని శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో ఆదివారం చందనోత్సవం నిర్వహించారు. అక్షయ తృతీయ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకమైన వెండి పీఠంపై శ్రీ లక్ష్మి నరసింహస్వామి, శ్రీ ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. ఆ ప్రాంగణంలోని బృందవనాన్ని ప్రత్యేకంగా సేకరించిన తేనెతో అభిషేకించి, చందనంతో అలంకరించి ద్రాక్ష, ఆపిల్ పండ్లతో ప్రత్యేక అలంకారం చేశారు. చామంతి పూలు, తులసి దళాలతో కర్పూర హారతి ఇచ్చారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ లక్ష్మి నరసింహస్వామి, ఆంజనేయస్వామితోపాటు శ్రీ గురురాఘవేంద్రస్వామి బృందావనాన్ని దర్శించుకున్నారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘన సన్మానం



చిన్న సుబ్బయ్య యాదవ్‌ను సత్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వికలాంగుల హక్కుల పోరాట సమితి నూతన రాష్ట్ర అధ్యక్షులు అన్నం చిన్నసుబ్బయ్య యాదవ్‌ను ఆదివారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో వివిధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల పింఛన్ రూ. 6 వేలకు పెంచాలని, తొలగించిన 9500 పింఛన్లను పునరుద్ధరించాలని కోరారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి దివ్యాంగులకు అన్ని విధాల న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ శివయ్య మాదిగ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు మాతయ్య, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పూసపాటి రెడ్డెయ్య ఇతర నాయకులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి



శిల్పారామంలో ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. మిస్బా మూవీ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. ప్రాచుర్యం పొందిన పాటలకు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.